# రైలు పెట్టె ఖరీదెంత

అనిల్ కుర్చీని అలమార దగ్గరకి లాగి కుర్చీమీద ఎక్కాడు. అలమార కున్న తలుపు తెరచి లోపల వున్న ట్రాన్సిస్టర్ తీయబోయాడు.

ట్రాన్సిస్టర్ ప్రక్కన వున్న గాజు ఫ్లవర్ వేజ్‌కి అనిల్ చేతులు తగిలి అదీ క్రింద పడింది. పెద్ద శబ్దంచేస్తూ పగిలిపోయింది.

అనిల్ వెంటనే భయంగా వంటగది గుమ్మంవైపు చూశాడు. ఆ శబ్దం విని కంగారుగా బయటకి వచ్చిన అనిల్ తల్లికి, అలమార దగ్గర కుర్చీమీద నుంచుని భయంభయంగా చూస్తున్న అనిల్ కనిపించాడు. కుర్చీ ప్రక్కన పడివున్న నీలరంగు ఫ్లవర్ వేజ్ తాలూకు ముక్కలు, ప్లాస్టిక్ పువ్వు కనబడ్డాయి.

ఆవిడ కోపం పట్టలేకపోయింది. ఏడేళ్ళకొడుకు చేసిన పనికి గబ గబా దగ్గరకెళ్ళి కుర్చీనుంచి రెక్కపట్టుకుని బలంగా క్రిందికి దింపింది.

దబ దబా వీపుమీద నాలుగు దెబ్బలు వేస్తూ ఇంకోసారి ఇలా చేస్తావా ? మళ్ళీ అలమారవైపు వస్తావా" అన్నది కోపంతో.

"కొట్టకు మమ్మీ! కొట్టకు" అన్నాడు అనిల్ గట్టిగా ఏడుస్తూ.

ఆవిడ కుర్చీని యథాస్థానంలో వుంచి, పగిలిన పెంకులని శ్రద్ధగా ఎత్తింది. అనిల్ గట్టిగా ఏడుస్తూ ఓ మూల కూర్చున్నాడు.

"ఛీ, ఛీ ఏ పనిచేసినా ఇంతే. ఏదో ఒకటి చెయ్యకుండా వుండవు కదా ? మొన్న కప్పు సాసర్ పగలకొట్టావ్." అన్నది ఆవిడ, చీపురు తెచ్చి చేత్తో ఏరడానికి సాధ్యంకాని చిన్నచిన్న పెంకులని దగ్గరకి వూడుస్తూ.

అనిల్ రాగం పెంచాడు.

"ఏడవకు" విసుక్కుంది ఆవిడ. అయినా ఆపలేదు అనిల్.

"అసలీ ఇంట్లో వుండద్దు. పో బయటకి" అన్నది చిరాకుగా.

దాదాపు అరగంట తర్వాత అనిల్ వంటగదిలోకి వచ్చాడు. డైనింగ్ టేబిల్‌ని డెట్టాల్ కలిపిన నీళ్ళలో ముంచిన తడిగుడ్డతో తుడుస్తున్న అనిల్ తల్లి అనిల్‌ని చూసికూడా మాట్లాడలేదు.

"నేనీ ఇంట్లో వుండద్దా? బయటకి పోవాలా?" అడిగాడు జాలిగా.

"మరి అలా అల్లరిచేస్తే నిన్ను ఎలా భరించటం?" అన్నది అనిల్ తల్లి.

"ఎక్కడికి పోను?" అడిగాడు బెక్కుతూ.

"ఇంట్లోకి రాకు. బయటే వుండు లేదా నువ్వే ఓ ఇల్లు కట్టుకో." అన్నది ఆవిడ మనసులో నవ్వుకుంటూ.

"మరి డబ్బు కావాలిగా?" అడిగాడు.

"మీ డేడీని అడుగు వచ్చాక."

"ఇస్తారా అడిగితే?"

"ఏమో! అడిగిచూడు."

అనిల్ డేడీ రాత్రి ఏడున్నరకి వచ్చాడు ఇంటికి.

"ఏరా? భోజనం చేశావా? అడిగాడు ఆయన అనిల్‌ని రెండు చేతులతో పైకెత్తి ఓసారి గాల్లో తిప్పి.

"డేడీ, నాకు డబ్బు కావాలి" అడిగాడు అనిల్.

"ఎంత?"

"ఫైవ్ హండ్రెడ్"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడాయన.

"ఇల్లు కట్టుకుంటాను."

"ఇల్లు కట్టుకుంటావా?" ఇంకా ఆశ్చర్యంగా అడిగాడాయన.

"అవును, మరేమో, మమ్మీ నన్ని ఇంట్లో వుండద్దంది. వేరే ఇల్లు కట్టుకోమంది"

భార్య వంక చూశాడాయన విచిత్రంగా ఏమిటీ సంగతి అన్నట్లుగా.

ఆవిడ చిన్నగా నవ్వి జరిగింది చెప్పింది.

"మరి అల్లరిచేయచ్చా?" అడిగాడు ఆయన కొడుకుని.

"అందుకే ఇల్లు కట్టుకుని దాంట్లో వుంటాను."

"ఎక్కడ కట్టుకుంటావ్ ?"

"బయట నందివర్ధనం చెట్టుపక్కన"

"అలాగే. మరి ఎంత పెద్ద ఇల్లు ?"

ఆ ప్రశ్నకి సమాధానం తెలియలేదు అనిల్‌కి.

"మరి నన్ను రానిస్తావా నీ ఇంటికి" అడిగింది కొడుకుని అనిల్ తల్లి.

"ఓ ! నువ్వు నా ఇంట్లో అన్నీ పగులకొట్టి అల్లరి చేయకూడదు మరి."

"అలాగే" అన్నదావిడ పగలబడి నవ్వుతూ.

"రైలుపెట్టె కట్టుకుంటాను. అన్నాడు అనిల్.

"రైలుపెట్టె ?"

"అవును. రైలుపెట్టెలోనే వుంటాను."

"రైలుపెట్టేమిటి ?" అడిగాడు అనిల్ తండ్రి.

"ఇలాంటి ఇల్లు కాదు రైలుపెట్టె."

"రైలుపెట్టె కట్టుకోవడం దేనికి ? ఒకటి కొనుక్కుంటే సరి" అన్నది అనిల్ తల్లి.

"డేడీ ! నాకో రైలుపెట్టె కొనివ్వవూ ?" అడిగాడు అనిల్.

"ఎక్కడ కొంటావ్ ?" అడిగాడాయన.

"రైల్వేస్టేషన్‌లో చాలా వుంటాయిగా ఒకటి అమ్మని అడుగుతాను రైలు వాళ్ళని.

"కొనిస్తాను కాని సందివర్ధనం చెట్టు ప్రక్కన రైలుపెట్టె పట్టదుగా ?" అడిగాడు అనిల్ తండ్రి కొడుకుని.

ఆలోచనగా తండ్రివంక చూశాడు కాసేపు. తర్వాత తల్లి వంక చూశాడు. ఆవిడ నవ్వుని ఆపుకుంటోంది పళ్ళు బిగబట్టి.

"ప్రక్కింటావిడని అడుగుతాను. వాళ్ళ ఇంటి కాంపౌండులో పడుతుందిగా"

"ఆవిడ ఒప్పుకుంటుందా మరి ? అద్దె అడగదూ ?" ప్రశ్నించింది అనిల్ తల్లి.

"డేడీ ! ఆవిడ అద్దె అడుగుతుందా ?" అడిగాడు అనిల్ తండ్రివైపు తిరిగి.

"నువే అడిగిచూడు."

అనిల్ బయటకి పరిగెత్తాడు వేగంగా, భార్యాభర్తలిద్దరూ ఒకరి మొహాల్లోకి మరొకరు చూస్తూ నవ్వుకున్నారు.

అయిదారునిముషాల తర్వాత వచ్చాడు అనిల్.

"ఏమంది." అడిగింది అనిల్ తల్లి ఉత్సాహంగా.

"రైలుపెట్టె తెచ్చుకోమంది. అద్దె తీసుకోదట." సంతోషంగా చెప్పాడు.

"ఇకనేం ? మీ డేడీని కొనిపెట్టమని అడుగు" అన్నది అనిల్ తల్లి.

అనిల్ తండ్రి భుజాలమీద చేతులు వేసి అడిగాడు వేడుకోలుగా.

"డేడి ! నాకో రైలుడబ్బా కొనిపెట్టవా ?"

"మరి దాని ఖరీదెంత ? కనుక్కో" అన్నాడాయన అనిల్ కుడి బుగ్గమీద ముద్దుపెట్టుకుని.

"ఎవర్ని అడగాలి ?" అడిగాడు.

"రైలు స్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్ వుంటాడు. ఆయన్ని అడిగితే చెప్తాడు" అనిల్ తల్లి చెప్పింది.

"టెలిఫోన్ నంబర్ ?" అడిగాడు అనిల్.

"డైరెక్టరీలో వుంటుంది."

అనిల్ టెలిఫోన్ టేబిల్‌మీద వున్న టెలిఫోన్ డైరెక్టరీ తండ్రి దగ్గరికి తీసుకువచ్చాడు.

"నేను తర్వాత కనుక్కొని చెప్తాలే" అన్నాడాయన నవ్వుతూ.

తండ్రి మొహంలోకి అపనమ్మకంగా చూశాడు అనిల్.

"పాపం ! ఫోన్ చేయనివ్వండి" అన్నది అనిల్ తల్లి భర్తతో.

స్టేషన్‌మాస్టర్ టెలిఫోన్ నంబర్ చూసి కాగితంమీద వ్రాసిచ్చాడు, అనిల్ తండ్రి అనిల్‌కి.

అనిల్ ఉత్సాహంగా టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి ఆ నంబర్ డయల్ చేశాడు.

భార్యాభర్తలిద్దరూ అనిల్ వంక చూశారు నవ్వుతూ.

"హలో ! స్టేషన్‌మాష్టర్ వున్నారా ?" అడిగాడు అనిల్.

"................"

"రైలుపెట్టె అమ్ముతారా ? అడిగాడు.

"................"

"రైలుపెట్టె- ఎంత దాని ఖరీదు ?"

"................"

"నా పేరు అనిల్‌కుమార్."

"................"

"నా వయసు ఏడు సంవత్సరాలు. సెయింట్ ఏన్స్‌లో ఫోర్త్ స్టాండర్డ్ చదువుతున్నాను."

"................"

"మా ఇంటినుంచి ఫోన్ చేస్తున్నాను."

"................"

"వజీర్ సుల్తాన్ టొబాకో కంపెనీలో పనిచేస్తున్నారు మా డేడీ."

"................"

"అవును. రైలుపెట్టె కొంటాను. డబ్బిస్తానన్నారు మా డేడీ."

"................"

" మా మమ్మీ నన్ను ఇంట్లో నుంచి వెళ్ళిపొమ్మంది. మా పక్కింటావిడ రైలుపెట్టె పెట్టుకోవడానికి చోటిస్తానంది. మా డేడీ రైలుపెట్టె కొనిస్తానన్నారు దాంట్లో వుంటాను నేను."

"................"

"ఇల్లు కట్టుకోను. రైలుపెట్టెలో అయితే బాత్‌రూం, లేవెట్రీ కూడా వుంటాయి. అందుకని. కిటికీలోంచి బయటకి చూడచ్చుకూడా."

"................"

"రైలుపెట్టె మీరు అమ్మకూడదా? మీ దగ్గర స్టేషన్‌లో చాలా వున్నాయిగా?"

"................"

"ఎవరు? రైల్వే మినిష్టర్ అమ్ముతారా? ఆయన ఎక్కడ వుండేది?"

"................"

"మరయితే ఎలా? ట్రంక్‌కాల్ చేసి మాట్లాడనా?"

"................"

"అడ్రస్' చెప్పండయితే."

"................"

అనిల్ ఫోన్‌లో వింటూ చిరునామా వ్రాసుకున్నాడు కాగితంవెనక.

"థాంక్ యూ స్టేషన్ మాస్టర్. ఎప్పుడయినా మా ఇంటికి రండి."

"..............."

"అలాగే. ఆయన అమ్మితే, డేడీ కొనిపెడితే తప్పక పిలుస్తాను. నా ఇంటికే వద్దురుగాని థాంక్స్."

ఫోన్ పెట్టేసి తండ్రి దగ్గరకి వచ్చాడు అనిల్.

ఇంగ్లీషులో స్టేషన్ మాస్టర్‌కి అనిల్‌కి మధ్య జరిగిన సంభాషణ విన్న దంపతులిద్దరూ నవ్వుకోసాగారు.

'ఈయనకి రాయాలిట" అన్నాడు ఆ కాగితం చూపించి.

"రాయి అయితే ఆయన ఎంతో ఖరీదు చెప్తే చెక్కు రాసిస్తాను" అన్నాడు అనిల్ తండ్రి.

అనిల్ మర్నాడు యూనియన్ రైల్వే మినిష్టర్‌కి పెన్సిల్‌తో, తన నోట్‌బుక్‌లోంచి చింపిన రెండు కాగితాలమీద తనకి అందుబాటులో వున్న కొద్ది ఇంగ్లీషు పదాలతో పొందికగా జరిగింది వ్రాసి రైలుపెట్టె అమ్మమన్న దాని ఖరీదు ఎంతో వ్రాయమని ఉత్తరం వ్రాశాడు.

ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేశాడు.

రోజూ సెయింట్ఏన్స్ కాన్వెంట్ నుంచి రాగానే తల్లిని అడగటం మొదలుపెట్టాడు. ఢిల్లీనుంచి తన కేమయినా ఉత్తరం వచ్చిందా అని.

నెలరోజులయినా రాలేదు.

విసుగు పుట్టింది అనిల్‌కి.

ఓ రోజు కాన్వెంట్ నుంచి ఇంటికి వచ్చాక అనిల్ తల్లి ఓ పెద్ద ప్యాకెట్‌ని అందించింది అనిల్‌కి, ఢిల్లీనుంచి అది వచ్చింది.

దాన్ని విప్పిచూశాడు అనిల్.

లోపల మూడడుగుల పొడవు, అడుగు వెడల్పు, రెండడుగుల ఎత్తు గల చిన్న రైల్వే కంపార్ట్‌మెంట్ వుంది.

దాంతో బాటు ఓ ఉత్తరం ఇంగ్లీషులో ఎలక్ట్రిక్ టైప్‌రైటర్‌తో నీట్‌గా టైపు చేయబడి వచ్చింది.

అనిల్ ఆ ఉత్తరం చదివాడుకాని అర్థం కాలేదు.

"మమ్మీ! ఏం రాశారు? ఎంతట రైలు డబ్బా ఖరీదు?" అడిగాడు తల్లిని. అనిల్ తల్లి ఆ ఉత్తరానికి అర్థం తెలుగులో చెప్పింది.

"యూనియన్ రైల్వే మినిష్టర్ రాశారు నీకు. నీ ఉత్తరం అందిందిట. రైలుడబ్బా ప్రక్క వాళ్ళింట్లో వుంచి, దాన్ని ఇల్లులా చేసుకుని నువ్వు అందులో వుందామనుకోవటం ఆయనకి ఎంతో నచ్చిందిట. కాని ప్రస్తుతం రైలు డబ్బాలు అమ్మడానికి ఏమీ లేవుట. నువు పెద్దయ్యాక రైలు ఇంజన్ డ్రయివర్‌గానో, గార్డుగానో ఉద్యోగంలో చేరి రైల్లో వుండొచ్చుట. అప్పుడు నీకు ఉద్యోగం ఇస్తారట. అంతదాకా ఈ చిన్న రైలుపెట్టెని గుర్తుగా వుంచుకోమని రాశారు."

ఆఫీసునుంచి వచ్చాక అనిల్ తల్లి తన భర్తకి ఆ ఉత్తరం చూపించింది.

"గుడ్ గ్రేషియస్! రైల్వే మినిష్టరే స్వయంగా సంతకంచేసి పంపారు ఉత్తరాన్ని, ఆయన సెక్రటరీ కాదు." అన్నాడు అనిల్ తండ్రి సంతోషంగా.

(స్వాతి మంత్లి ఫిబ్రవరి 1979)